



[రత్నగర్భమైన, మనదేశంలో, తినడానికి తిండి, కట్టడానికి బట్టా, లేక అల్లాడు దరిద్రజీవులు అనేకవేలమంది, ప్రతీ గ్రామంలోను, ప్రతీ వీధిలోనూ వున్నారూ అంటే దీనికికారణం, తనతోటి స్వదేశస్థుని స్వార్థపరత్వమే. అట్టి స్వార్థాన్ని వుపయోగించి, తనతోటి స్వదేశస్థులను తిండికి, బట్టకు దూరంజేసి, కాలిక్రింద పురుగువలె నల్పివేయు స్వార్థపరులకు యిదొక దృష్టాంతం. ఇక చదవండి]

"బాబూ బహుబీదలమూ...అనాథలమూ...
దిక్కులేనీ పక్షులమూ...
ఒక్కనికైనా దయరాదా...బాబూ
బాబూ అనాథలమూ...బహుబీదలమూ..."

అనే నా పాటను వినికాబోలు, శెట్టిగారు బయటకువచ్చారు. ఆ గూనబొజ్జా— మెడలో చిన్న రూళ్ళకఱ్ఱ లావువంటి ఆ జంధెం—మసిబొగ్గును మించిన ఆ శరీరచ్ఛాయ— మోకాళ్ళవరకూగల ఆ పంచె —నొసటను నూటపదునొకటి వీటిని చూచినతోడనే ఈయన శెట్టిగారు అని అతిసునాయాసంగా చెప్పవచ్చు.

నాలో ఒక దివ్యతార మెరిసినట్లయింది. నాలో అందమైనభావాలన్నీ ఒక్కసారిగా పైకుబికినాయి. ఆ నిముషములో నన్ను అదృష్టదేవత వరించినట్లింది. నా కష్టాలన్నీ గట్టెక్కాయి అని అనుకున్నా—నాకు తెలియకుండానే నా హృదయం నన్ను ఆ శెట్టివద్దకు తీసికొనిపోయింది. నేను దగ్గరగా చేరానో లేదో, శెట్టిగారు ఒక్కసారిగా ఎగాదిగా చూచి, గ్రుడ్లెఱ్ఱజేసి, చిమచిమలాడుచూ, గబాలుమనివెళ్లి, డభాల్ మని తలుపులు రెండూ వేసేసాడు.—నాలో వెలిగిన ఆశాజ్యోతి ఆరిపోయింది. నా ఆశలన్నీ, గాలిలోని జ్యోతివలె, మటుమాయమయ్యాయి.

ఈ గర్భదరిద్రుణ్ణి ఆదరించి, ఏదో దారి చూపిస్తాడని అనుకొన్నా—లేదు. యింకా నేను అనుభవించవలసిన కష్టాలు ముందు యింకా ఎన్నో యున్నాయని, ప్రళయకాలంలోని మేఘ గర్జనలాగు నా హృదయం టప, టప, మని కొట్టుకొంది.

ఈ నిర్భాగ్యునివైపు అటువంటి లక్షాధికారే కన్నెత్తి చూడకపోతే, యిక యీ ప్రపంచంలో ఈ క్షుద్బాధాపీడితునివైపు చూచేదెవరు?...ఇటువంటి ధనవంతులకే, మావంటి క్షుద్బాధాపీడితుల ఆర్తనాదాలు వినపించకపోతే, యిక యీ ప్రపంచంలో మా ఆర్తనాదాలను వినేదెవరు?...

ఎండిపోయిన పెదవులను నాలుకతో తడిచేసుకొంటూ, ఆ చోటునుండి మరియొక చోటుకు పోవుట తప్ప వేరుమార్గ మేదీ కనుపించలేదు. యిది మా నిత్యకృత్యమే కదూ! అంచేత మాకిది క్రొత్తకాదు.

ఎక్కడకుపోయినా, ఏ మహనీయుణ్ణడిగినా తొంటచెయ్యి తప్ప నా కగుపించేది ఏదీ లేకపోయింది...యిలా ఎన్నిరోజులు, ఎన్నిగ్రామాలు తిరిగేనో నాకే తెలియదు—ప్రాణం విసిగిపోయింది. ఎందుకీ మొండిజీవివుండి, ఎవర్నుద్ధరించను! యిలా బ్రతికి ఉండి. ఈ జానెడు పొట్టకోసం, మాన, మర్యాదలు, నట్టేటకలిపి, ఎంతమందినని, ఎన్నిరోజులని, యాసించడం! ఎందుకీ చదువు? ఉన్న ఆస్థి నంతను, ఈ బెత్తెడు కాగితపుముక్కకు పోసి, యిలా వీధివీధికి తిరిగి ముష్టి ఎత్తటానికా? అఖరకు యిలా తయారుచేసింది, యీ యింగ్లీషుభాష మనదేశంలో ప్రవేశించి.

పన్నెండుదినములనుండి అన్నమురుచి ఎరుగని ప్రేగుల అరపులు దిక్కులు బ్రద్దలవుతున్నాయి.

ఆకలిచే కడుపు దహించుకుపోతుంది. నీరసంతో యింక ఒక్క అడుగైనా ముందుకు పడడంలేదు. తడిలేక నోటిమాట హరించిపోయింది.

ఇక ఎవర్నడగను? ఈ నా ఆకలిని తీర్చే దాత ఎవరు? పన్నెండు రోజులనుండి ఒక్కసారైన, గుప్పెడు మెతుకులు తినని ఈ నా జీవితం ఎందుకు? గుప్పెడు అన్నంపెట్టని దాతే లేడు, యీ ప్రపంచంలో...తనతోటి సోదరుని ఆకలిబాధను తీర్చలేని యీ ప్రజావళిమధ్య ఎందుకు జీవించడం? ......అని నా మనస్సు పరిపరివిధాల పరితపించింది. నా మెదడులో రైళ్లు పరుగెత్తుచున్నట్లుంది. నా శరీరముమీద తేళ్ళు, జెర్రిలు ప్రాకుచున్నట్లున్నాయి. నా అవయవాలు నా ఆధీనంలో లేవు.

ఇక నాకీ ప్రపంచంలో "నా" అనేవారెవరు?—ఈ దరిద్రుడొక్కడు కృశించి, నశించి చనిపోతే, ఈ విశాలలోకానికి లోటా?...యిటువంటి నిస్సహాయ స్థితిలో చస్తేనే మేలు...అని దృఢనిశ్చయం చేసుకొన్నా—నడవ ప్రయత్నించాను—ముఖము ఎఱ్ఱబారింది--కళ్లు పచ్చబడ్డాయి—మార్గం, అమార్గమైంది-నీరసంచే కళ్లుదిరిగి, స్పృహతప్పి క్రిందపడిపోయాను.—......

అని అంతవరకూ చెప్పిన, ఆ దరిద్రజీవిగాథ, విన్న నాకు అప్రయత్నంగా రెండు కన్నీటి బిందువులు నేలబడ్డాయి.

"నేనిప్పుడు యిక్కడకు ఎలా రాగలిగేను? బాబూ!" అని అడిగేడు అతి మర్యాదగా ఆ దరిద్రజీవి.

"—తరువాత, స్పృహతప్పివున్న, నిన్ను జూచి, ఆశ్చర్యపడి, ఓ అరగంటకల్లా తేరుకుంటావనే ఉద్దేశ్యంతో, నే నిక్కడకు చేర్చాను."

"ఎందుకని నాయనా! మళ్లీ యీ మాయా ప్రపంచంలోకి నన్ను యీడ్చావ్?"

నేను: "అసలు నీకీ ప్రపంచంపై ఈ విరక్తి ఎలా కలిగింది?"

అతను ఒక దీర్ఘ నిట్టూర్పువిడిచి, "దీనికి జవాబేమని చెప్పను?"

ఈ విశాల ప్రపంచములో అనేక కోట్ల ప్రజలు నిండివున్నారు. ఇంత విశాలమైన మన భారతదేశము, సిరిసంపదలచే తులతూగి, రత్నగర్భయై, తుదకు అన్నపూర్ణయని; అతిథి సత్కారములకు అంకితమైన మేటి, అనికూడ పేరుమోసి—నేడు భీకర క్షామదేవతకు నిలయస్థానమైంది అంటే, ఎలా అయింది? పరరాజులు, పెట్టని గోడలవలె నున్న, మన రత్నఖచిత గోడలను తీసికొనిపోయినప్పటికిని, చెక్కుచెదరని మన భారతమాత—నేడు స్వార్థపరులనెడి మానవరాక్షస నిరంకుశత్వంలో పడి, నలిగి, పిప్పియగుచున్నది.

అందుచేతనే యీ—గొప్ప—బీద, అనే తారతమ్యం ఉద్భవించుటకు హేతువు.


## మదనకామేశ్వర లేహ్యము




బలవర్థకమయినది. మేహము నిక్కాక, నిస్సత్తువ, శుక్లనష్టము, అతిమూత్రము, మొదలగు వాటిని హరించి, మిక్కిలి బలమును, వీర్యవృద్ధిని, భోగశక్తిని కలిగించుటలో అప్రతిహతమయినది.

2 డబ్బీలు చాలును.

20 తులముల డబ్బీ రు. 2-0-0

## రోజాపుష్ప లేహ్యము

మధురమయినది. మలబద్ధకమును ఖండించుటలో అమోఘమైనది. అజీర్ణము, గర్భవాయువు, మూలవ్యాధి, మొదలగు వాటిని హరించి కొలవిరేచనమును చక్కగా కలిగించును.

15 తు॥ డబ్బీ రు. 1-0-0 వి. పి. చార్జి ప్రత్యేకము.

అన్ని ఔషధముల క్యాటలాగు ఉచితం.

పి. సి. ఎ. అండు కంపెనీ,

ఆయుర్వేదపసమాజం-పెరిదేపి, నెల్లూరుజిల్లా.

కానీ: నాయనా! ఈ నిర్భాగ్యునిపై యీ ప్రపంచములో ఎవ్వరికీలేని, యీ దయ మీకెలా కలిగింది!...సంతోషం... నూరు కాకులలో నొక రాజహంసమాదిరిగా, ఈ రాక్షసప్రపంచములో, మీరొక్కరు. దయామయులైనంతమాత్రంచేత, సంఘం ఎప్పటికీ బాగుపడదు. బాబూ! కానీ... మీరీ నిర్భాగ్యుణ్ణి కాపాడేరూ అంటే సంఘంలో యెదుర్కొనవలసిన సమస్యలనేకములున్నవి. ఈ దరిద్రుని గురించి, మీ జీవితాంతమువరకూ, కష్ట పరంపరములలో ముంచుట నామనస్సంగీకరించదు.

తనది అన్నము, ఎగుటివారిది కుంభము, అని అనుకునే, స్వార్థముతో నిండియున్న యీ ప్రపంచములో మాబోటి దరిద్రులకు తావులేదు...వుండను బాబు...నేను యీ ప్రపంచములో వుండను... ...వుండను...మీవద్ద వుండను, మరి యెవ్వరివద్దనూ వుండను...'' అని లేచి, లేని ఓపికను తెచ్చుకొని, వెళ్ళబోవు ఆ నిర్భాగ్యునివైపుచూచి ఆశ్చర్యపోయా.

''ఎక్కడకు వెళ్తావ్, ఈ నిస్సహాయస్థితిలో'' అనిమాత్రమే అనగలిగేను!

''ఎక్కడకని చెప్పను — క్షుద్బాధాపీడితుల ఆర్తనాదాలోకానికి—దేశంలోని నిర్భాగ్యుల నివాసస్థలము ఎక్కడో అక్కడికి......అక్కడనేవుంది మా ఆనందం, సౌఖ్యం ... తోటిదేశస్థుని రక్తము పీల్చే రాక్షసులు అక్కడెవరూ వుండరు. అదే సరియైనలోకం. అక్కడనే మంచిగౌరవము, మర్యాద, యిమిడివున్నాయి. ప్రక్కవ్యక్తి హృదయారాటమును గ్రహించే, శక్తి అక్కడ ప్రతీఒక్కనియందు యిమిడీకృతమైయుంది ... అదే స్వర్గసీమ ... అదే స్వర్గము ... అక్కడకే పోతా...యీ దరిద్రుడు, ఎక్కడవుంటే యేమి యీ ప్రపంచానికి? చస్తేనే సంతోషిస్తుంది యీ లోకము.'' అని అడుగులలో అడుగులువేసుకుంటూ, మెల్లిగా వెళ్లిపోయాడు. కానీ నేనుమాత్రం ఆ దరిద్రుడుపోయిన మార్గమువైపు అలానిలచుని శూన్యంగా చూస్తూ నేవున్నా.

